

టపాసుల వ్యాపారం రెండ్రోజులే

ధరలు పేలడం ఖాయం..!

● రూ.40 వేలు కడితేనే లోపలికి ● వసూళ్ల భారం కొనేవారిపైనే..!

సిద్ధమైన షెడ్లు



అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి టపాసుల వ్యాపారం రెండ్రోజులకే పరిమితమైంది. లాటరీ తీయడం, లైసెన్స్‌లు మంజూరు చేయడం ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి ఎదురైంది. ఆర్డీఓ, డీఎస్పీల ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం లాటరీ తీశారు. సాయంత్రం 6గంటల నుంచి లైసెన్సులు జారీ చేశారు. ఆ తరువాత వ్యాపారులు శనివారం రాత్రంతా షెడ్లలో సరుకు సర్దుకునేందుకే సరిపోయింది. పండుగ సోమవారం కావడంతో ఆది, సోమవారాల్లో మాత్రమే వ్యాపారం జరుగుతుంది. సమయం సరిపడదని వ్యాపారులు వాపోతున్నారు.

రూ.40 వేలు కడితేనే..

టపాసుల విక్రయానికి ఒకే చోట షెడ్లు ఏర్పాటు చేస్తారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు వీటి నిర్వహణ చూసుకుంటారు. ఈ సారి నగరంలో ఓ చోటా నాయకుడికి అవకాశం ఇచ్చారు. ఆయన ఒక్కో దుకాణానికి రూ.40 వేలు నిర్ణయించారు. ఆ సొమ్ము చెల్లిస్తేనే వ్యాపారానికి అనుమతిస్తున్నారు. సగం డబ్బు చెల్లించినా లోపలికి అనుమతించడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో షెడ్ ఏర్పాటుకు రూ.15 వేలు, ఇసుక, నీరు, విద్యుత్ సౌకర్యానికి రూ.5 వేలకు మించి ఖర్చు కాదని వ్యాపారులు అంటున్నారు. ఒక్కో దుకాణంపై రూ.20 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన నగరంలో 120 దుకాణాలకు రూ.48 లక్షలు వసూలైతే, రూ.24 లక్షలు నిర్వాహకుల ఖాతాలోకి వెళుతోంది. వసూలు చేసే వారి వాహనంపై 'జ్యుడీషియల్' అని రాసి ఉండటం విమర్శలకు దారితీస్తోంది.

మా వాళ్లొస్తారు: పోలీసులు

'మా వాళ్లొస్తారు. గిఫ్ట్‌బాక్స్‌లతో పాటు టపాసులు ఇవ్వండి' అని కొందరు పోలీసు అధికారులు ఇప్పటికే సంకేతాలిచ్చినట్లు సమాచారం. వ్యాపారులు అనుమతుల కోసం నగరంలోని పోలీస్‌స్టేషన్లకు వెళ్లినప్పుడు ఈ విషయం వారికి చెప్పినట్లు తెలిసింది.

ధరలు.. ఢాం.. ఢాం..

వసూళ్లు, ముడుపులు, బహుమతుల టపాసులన్నీ సామాన్యుల గుండెల్లో పేలడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ అక్రమాలు ఎంత ఎక్కువగా ఉంటే.. కొనేవారి జేబు అంత ఎక్కువగా ఖాళీ అవడం ఏటా పరిపాటిగా మారుతోంది. అన్ని ఖర్చులు కలిపి ఒక్కో దుకాణానికి రూ.లక్ష అవుతోందని వ్యాపారులంటున్నారు. ఈ మొత్తన్ని జనం నుంచే వసూలు చేస్తారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. శివకాశి నుంచి, పెద్ద వ్యాపారుల నుంచి చాలా తక్కువ ధరకు టపాసులను తెస్తారు. కానీ అధిక ధరలకు విక్రయిస్తారు.

రూ.82.12 లక్షల జీఎస్టీ

ఉమ్మడి జిల్లా పరిధిలో 389 దుకాణాలకే జీఎస్టీ చెల్లించారు. పట్టణాల్లో రూ.21వేల నుంచి రూ.25వేల వరకు, మండలాల్లో రూ.15వేల వరకు జీఎస్టీ చెల్లించారు. అనంతపురం-1, అనంతపురం-2, గుంతకల్లు, హిందూపురం, కళ్యాణదుర్గం పుట్టపర్తి, తాడిపత్రిలో మొత్తం 389 దుకాణాలకు రూ.82.12 లక్షలు పన్నుల శాఖకు జీఎస్టీ చెల్లించారు.

జర్నలిజంలో విశ్వసనీయత ముఖ్యం ● ప్రభుత్వ విప్ కాలవ ● ముగిసిన రెండురోజుల శిక్షణ 9

పరిశుభ్రతతోనే ఆరోగ్యం: ఎంపీ

● ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: కలెక్టర్
● కూడేరులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

కూడేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల స్వచ్ఛమైన గాలి వస్తుందని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం కూడేరులో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎంపీ, కలెక్టర్‌తో పాటు రాష్ట్ర స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, స్థానిక సర్పంచ్ లలితమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కడదరకుంట రోడ్డులోని భగవతి ఫంక్షన్ హాల్ నుంచి ప్రధాన రహదారి వరకు విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెత్తతో సంపద కేంద్రాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా మొదటి స్థానం రావడం గర్వకారణమని, అధికారులు పని తీరు ఇందుకు నిదర్శనం అన్నారు. పెన్నహోబిళంలో మొక్కలు నాటే ప్రాజెక్టును తీసుకురావడానికి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో చర్చిస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 9 శాతం మాత్రమే చెట్లు ఉన్నాయని అన్నారు. జిల్లాలో 25 లక్షల మంది జనాభా ఉన్నారని, ఏడాదికి 25 లక్షల మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ భవాని రవికుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, ప్రతి ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు దరిచేరవన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ గురుప్రభాకర్, డీపీఓ నాగరాజనాయుడు, సీఈఓ శివశంకర్, డ్వామా పీడీ సలీంబాష, డీఆర్‌డీఏ పీడీ శైలజ, తహసీల్దారు మహబూబ్‌బాష, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఎంఈఓలు ఎండీ గౌస్, సాయికృష్ణ, ఏపీఓ పోలేరయ్య, ఏపీఎం డేవిడ్ ఫిలిఫిన్స్‌సన్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అంబికా

'పది'లో ఉత్తమ ఫలితాలు రావాలి

జిల్లాను ముందు వరుసలో నిలపాలి : డీఈఓ ప్రసాద్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురంవిద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను ముందు వరుసలో నిలపాలని టీచర్లకు డీఈఓ ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ సమావేశాన్ని డీఈఓ ఆకస్మికంగా పరిశీలించారు. క్లస్టర్ పరిధిలో ఎన్ని స్కూళ్లు ఉన్నాయి, ఎంత మంది టీచర్లు ఉన్నారు, సమావేశానికి ఎంత మంది హాజరయ్యారు తదితర అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. గతేడాది అనుకున్న స్థాయిలో పదో తరగతి ఫలితాలు రాకపోవడంతో వెనుక స్థానంలో ఉండిపోయామని తెలిపారు. ఈసారి ఇప్పటి నుంచే పిల్లలకు బాగా చదువుచెప్పి ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా పేరును ముందువరసలో నిలపాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా పిల్లలను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ బడులకు పేదవర్గాల పిల్లలే అధికంగా వస్తుంటారని, వారిని తమ పిల్లలలాగానే భావించి చదువులు చెప్పాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యంతో విపరీత పరిణామాలు

న్యాయాధికారి సాధుబాబు

అనంతపురం క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాహనాల కాలుష్యం పెరగడం వల్ల ప్రకృతిలో విపరీత పరిణామాలకు దారి తీస్తోందని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి సాధుబాబు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.

సైకిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జిల్లా న్యాయాధికారి

నగరానికి చెందిన ఫెడరల్ ఫ్రెండ్స్ గ్రూప్, బీఎస్‌ఎన్‌ఎల్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ ర్యాలీ కొనసాగింది. జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు సైకిల్ తొక్కుతూ ర్యాలీలో స్ఫూర్తినిచ్చారు. తర్వాత ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి సాధుబాబు మాట్లాడుతూ.. రోజురోజుకు పర్యావరణ సమతౌల్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. వాహనాల వినియోగం పెరగడంతో కాలుష్యం కూడా పెరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ రాజశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ మూర్తులకు ఘన నివాళి



వర్ధంతి సభలో మాట్లాడుతున్న వక్త

అనంతపురంరూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సాహితామూర్తులైన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, కళారత్న రావూరి భరద్వాజ , విశాలాంధ్ర స్వర్ణోత్సవ సాహితీ పురస్కార గ్రహీత చిలుకూరి దేవపుత్ర వర్ధంతి సభను స్థానిక కమలా నగర్‌లోని శ్రీ సాయి కళాశాలలో శనివారం నిర్వహించారు. శ్రీసాయి డిగ్రీ కళాశాల, తెలుగు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత కల్లూరి ఆనందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ .. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఆధునిక కవులకు మార్గదర్శి అని కొనియాడారు. అలాగే కవి భరద్వాజ రచనలు సున్నితమైన, మానసిక సంఘర్షణను కలిగి ఉంటాయన్నారు. చిలుకూరి దేవపుత్ర దళిత నేపథ్యంలో వచ్చిన సాహిత్యం అద్భుతమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దామోదరరెడ్డి, తెలుగు వెలుగు సంస్థ అధ్యక్షుడు టీవీరెడ్డి, కార్యదర్శులు అల్తాఫ్, సుబ్బరాయుడు, సాహితీ మిత్రులు పరమేశ్వరరావు, కృష్ణారెడ్డి, కెఎల్ఎన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

అనంతపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎస్కేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అనిత తెలిపారు. మండలంలోని ఆకుతోటపల్లి సచివాలయం -2లో శనివారం మహిళల ఆరోగ్యం- పోషకాహారం- పరిశుభ్రత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందుకు వీసీతోపాటు రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ అరుణకుమారి హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ.. మహిళలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే వ్యక్తి పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎస్కేయూ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ శోభలత, హెల్త్ సెంటర్ చైతన్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జ్యోతుల మహోత్సవం

● పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత



వాల్మీకి విగ్రహం వద్ద ఎమ్మెల్యే ఇతర నాయకులు

రామగిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి గ్రామంలో వాల్మీకి కులస్థులు శనివారం వాల్మీకి మహర్షి జ్యోతుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యేపరిటాలసునీత పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని పంట పొలాలను, హంద్రీనీవా జలాలతో నిండిన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మరిన్ని చెరువులకు రానున్న రోజుల్లో హంద్రీనీవా నీటిని అందిస్తామని తెలిపారు. ఆమె వెంట టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య,మండల కన్వీనర్‌సుధాకర్, నాయకులు పోలేపల్లి ప్రభాకర్, తిమ్మానాయుడు, శ్రీధర్‌నాయుడు, మారుతీప్రసాద్, చిత్తరంజన్, శ్రీనివాసులు, నారాయణ, గోపీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

పోలేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాని పరిటాలసునీత తనిఖీచేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అక్కడి సిబ్బందిని ఆరా తీశారు. అలాగేఅనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త పోతుల కిష్టప్పకు చికిత్స నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సురక్ష యాప్ ద్వారానే మద్యం అమ్మాలి

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం అమ్మకాలు నిర్వహించాలని, అదేవిధంగా ప్రజలకు ఈ యాప్ గురించి అవగాహన కల్పించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. సీకేపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలను శనివారం ఆయన ఎన్‌పోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మద్యం దుకాణాల్లో మద్యం అక్రమంగా అమ్మడానికి వీలులేకుండా ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కావున దుకాణాల యజమానులు ఎటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు తావివ్వకుండా మద్యం అమ్మకాలు జరపాలన్నారు. అనంతరం సర్కిల్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఫరూక్ ఆజామ్, ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

● స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణం కోసం విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ సూచించారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో శనివారం ఆయన మొక్కలు నాటారు. అలాగే పారిశ్రామిక వాడలో చెత్తను, పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిజ్ఞకరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. తర్వాత స్వచ్ఛతపై అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. జోనల్ మేనేజర్ నాగకుమార్, జీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

● అనంతపురం న్యూటౌన్: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో సిబ్బంది మొక్కలు నాటడం, పరిసరాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. చైర్‌పర్సన్ గిరిజమ్మ ముఖ్యఅతిథిగా హాజరై మొక్క లు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించినవారమవుతామని పేర్కొన్నారు. కార్యాలయ ఏఓలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రత్నాబాయి, శ్రీవాణి, షబ్బీర్ నియాజ్, మహబూబ్‌వలి, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

●అనంతపురం క్లాక్‌టవర్: అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయం సమీపంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఇందులో కమిషనర్ బాలస్వామి పాల్గొని మొక్కలు నాటి నీరుపోశారు. నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్, ఈఈ షాకీర్, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, ఏఎంసీ కాంట్రాక్టర్లసంఘం అధ్యక్షుడు సరిపూటి శ్రీకాంత్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● అనంతపురం విద్య: స్థానిక దివ్యాంగుల వసతిగృహం ఆవరణలో విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి, ఏడీ అర్చన ఇతర ఉద్యోగులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. అలాగే మొక్కలు నాటారు. అనంతరం దివ్యాంగుల వసతి గృహానికి దాతలు తాగునీటి ఫ్రిజ్‌ను చైర్మన్ చేతుల మీదుగా అందించారు. పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ కార్యాలయంలో మొక్క నాటుతున్న అసిస్టెంట్ కలెక్టర్

ఏడీసీసీ బ్యాంకులో కారుణ్య నియామకం



నియామకపత్రం అందజేస్తున్న ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకులో కారుణ్యనియామకం చేపట్టారు. జులై 19వతేదీన విద్యుత్తు ప్రమాదంలో మృతి చెందిన ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగి రమేష్‌నాయక్ సోదరుడు మోహన్‌నాయక్‌కు శనివారం స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్‌లో బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి కారుణ్య నియామకం కింద నియామకపత్రం అందజేశారు. బాధిత ఉద్యోగి కుటుంబానికి బ్యాంకు తరఫున రావాల్సిన అన్ని బెనిఫిట్స్ సకాలంలోనే అందజేసి, కుటుంబ సభ్యుడికి నియామకపత్రం అందజేశామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు

రాప్తాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాప్తాడు ఉన్నత పాఠశాలలో శనివారం చెకుముకి సైన్స్ సంబరాలు జరిగాయి. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ గేయానంద్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పతంతో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే సంపూర్ణ పరిజ్ఞానం పొందగలుగుతారని సూచించారు. అనంతరం చెకుముకి ప్రశ్నపత్రంను విడుదల చేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ కన్వీనర్ భాస్కర్, ఎంఈఓ కుళ్లాయప్ప, హెచ్ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం టౌన్: భైరవనగర్‌లోని ప్రతిభ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ ప్రసూన ముఖ్యఅతిథిగా హాజరై చెకుముకు సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనిల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ కొండారెడ్డి, జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి బొలెరో నియో, బొలెరో ది బాస్ ఎడిషన్



మార్కెట్లోకి బొలెరో వాహనాలను విడుదల చేస్తున్న షోరూం సీఈఓ తదితరులు

అనంతపురం రూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఎంజీబీ మొబైల్స్, మహీంద్రా షోరూం ఆధ్వర్యంలో మహీంద్రా బొలెరో సెగ్మెంట్‌లో బొలెరో నియో , బొలెరో ది బాస్ ఎడిషన్ వాహనాలను మార్కెట్లోకి శనివారం విడుదల చేశారు. రుద్రంపేట సమీపంలో గల షోరూంలో కస్టమర్లు, ఫైనాన్షియర్లతో కలిసి ఎంజీబీ మొబైల్స్ సీఈఓ ఆదిత్యమాచాని జ్యోతి ప్రజ్వలన చేసి వాహనాలను మార్కెట్‌లోకి విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బొలెరో ది బాస్ ఎడిషన్ నాలుగు రకాల రంగుల్లో లభిస్తుందన్నారు. ఎక్స్ షోరూం ధర రూ.7.89లక్షల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. బొలెరో నియో 9రంగులలో లభిస్తుందన్నారు. దీనికి ఎక్స్ షోరూం ధర రూ.8.49లక్షల నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వంశీకృష్ణ, సేల్స్ మేనేజర్ మస్తాన్‌వలీఖాన్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మృతికి నివాళులు

ఆత్మకూరు అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు టీడీపీనాయకులు శనివారం మృతిచెందారు. పి .కొత్తపల్లికి చెందిన ఎస్టీసెల్ జిల్లానాయకుడు గుజ్జులు వెంకటేసు(40) గుండె పోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలున్నారు. అలాగే పంపనూరు మాజీ సర్పంచ్ పద్మావతి భర్త రామచంద్ర (50) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాలసునీత బాధితుల కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మండల టీడీపీకన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర విభిన్నప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి, సొసైటీ చైర్మన్ క్రిష్ణమోహన్ చౌదరి, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, నాయకులు మల్లికార్జున రెడ్డి,అనిల్ చౌదరి తదితరులు వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

పారిశుధ్య కార్మికులను కొనసాగించాలి

అనంతపురం వైద్యం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను విధుల్లో కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డిమాండ్ చేశారు. శానిటేషన్ సూపర్‌వైజర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ దురుసుగా ప్రవర్తించిన ఏజెన్సీ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని శనివారం ఆయన రెండోపట్టణ సీఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదుచేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆస్పత్రిలో దశాబ్దాలుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను నిబంధనల పేరుతో తొలగించాలని చూస్తుండడం దారుణమన్నారు. అలా చేసే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. కార్మికులకు న్యాయం చేయాలన్నారు. లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకలు రామాంజనేయులు, బాధిత సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారి తనిఖీలు

అనంతపురం అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల శ్రీ సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీ దుకాణంలో అనంతపురం ఏఓ వెంకట్‌కుమార్ శనివారం తనిఖీలు చేశారు. కూడేరు మండలం కమ్మూరుకు చెందిన ఓ రైతు ఫిర్యాదు మేరకు ఆ దుకాణంలో తనిఖీలు చేయాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏఓ వెంకట్‌కుమార్ తనిఖీలు చేపట్టి అక్కడున్న ఎరువులు, పురుగు మందుల స్టాక్‌తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అగ్రోమిన్ మ్యాక్స్ 122 ప్యాకెట్లు (ఒక్కోప్యాకెట్ 500 గ్రాములు) సీజ్ చేసి, అమ్మకాన్ని నిలుపుదల చేశారు. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు ఏఓ పేర్కొన్నారు. పరీక్ష ఫలితాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.


విలీనం సమస్యలను పరిష్కరిస్తాం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు గ్రామీణ బ్యాంకులు విలీనం చేసిన నేపథ్యంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు గ్రామీణ బ్యాంకులు విలీనం చేసిన నేపథ్యంలో ఈనెల 9 నుంచి 13వ తే దీ వరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేశారు. ఈ నేపథ్యంలో ఖాతాదారుల నుంచి సమస్యలు, అభిప్రాయాల సేకరణకు శనివారం స్థానిక రామచంద్రనగర్ బ్రాంచ్‌ను ఆర్ఎం సందర్శించారు. ఈ సందర్భంగా ఖాతాదారుల నుంచి సమస్యలు, సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఎక్కువగా ఆన్‌లైన్, డిజిటల్ పేమెంట్లకు టెక్నికల్ సమస్య వస్తున్న మాట వాస్తవమేనని, త్వరలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అవుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 65బ్రాంచ్‌లలో ఖాతాదారుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఇక నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రాజధాని అమరావతిలోని ప్రధాన కార్యాలయం నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తుందని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మా పీడీగా శివనారాయణ

అనంతపురం అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఆత్మా పీడీగా శివనారాయణ నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా ఉన్న ఆయన్ను ఇక్కడ ఆత్మా పీడీగా నియమించారు. దీపావళి తర్వాత బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

అనంతలక్ష్మిలో ఘనంగా ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న జేఎన్‌టీయూఏ డైరెక్టర్ సత్యనారాయణ

అనంతపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లిలో గల అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూఏ అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ , అనంతలక్ష్మి విద్యాసంస్థల చైర్మన్ అనంతరాముడు, వైస్‌చైర్మన్ రమేష్‌నాయు డు, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదల తో చదివేవారికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి తమలోని ప్రతిభను గుర్తించగలిగితే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చునని అన్నా రు. చైర్మన్ అనంత రాముడు మాట్లాడుతూ..విద్యార్థులు బాగా చదువుకుని గొ ప్పస్థాయిలో ఉండడమే తల్లిదండ్రులకు ఇచ్చే బహుమానం అన్నారు. వైస్‌చైర్మన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కళాశాలలో గల సౌకర్యాలను ఉపయోగించుకొని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. తర్వాత ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. కళాశాల డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తుగా దీపావళి



అనంతలక్ష్మి పాఠశాలలో మాట్లాడుతున్న చైర్మన్ అనంతరాముడు

అనంతపురం రూరల్/ విద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని ఇటుకలపల్లి సమీపంలో గల అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత విద్యాసంస్థల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు మాట్లాడి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం పిల్లలతో కలిసి తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, కాకరపువ్వులు వెలిగించి ఉత్సాహంగా గడిపారు. పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషదారణలో నరకాసురుడిని సంహరించిన ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. సీఏఓ నరసింహారావు, హెచ్ఎం శాలిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నగరంలోని రామ్‌నగర్‌లో గల నారాయణ, మినర్వా పాఠశాలల్లోనూ దివాళి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు.

పటిష్ట స్థితిలో ఆంధ్రా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాహుల్ డబుల్‌సెంచరీతో.. ఆంధ్రా జట్టు భారీ స్కోర్‌తో పటిష్ట స్థితికి చేరింది. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో బీసీసీఐ కోల్ సీకే నాయుడు అండర్-23 ఆంధ్రా క్రికెట్ అసోయేషన్ టోర్నీ శనివారం కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోర్ 470-4తో మూడో రోజు ఆట ప్రారంభించిన ఆంధ్ర జట్టు 181.5ఓవర్లలో 6వికెట్లకు 630 పరుగులు చేసింది. బ్యాటర్లు ఎస్‌వీ రాహుల్ 386బంతుల్లో 18బౌండరీలు, రెండు సిక్సర్లతో డబుల్ సెంచరీ (203)పరుగులు చేశారు. అభినవ్ సెంచరీ (101) చేయగా, ప్రసాద్ 94, తేజ 76, సాయిశ్రావణ్ 73పరుగులు చేశారు. దీంతో ఆంధ్రా జట్టు భారీ స్కోర్‌తో పటిష్ట స్థితిలో నిలిచింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన ఢిల్లీ జట్టు 63ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 200పరుగులు చేసింది. బ్యాటర్లు దేవ్‌లాక్రా 91 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, యుగల్ సైనీ 44పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్ ఆదిత్యరెడ్డి 3వికెట్లు తీయగా ఢిల్లీ 430పరుగులు వెనుకబడి ఉంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఢిల్లీ 200-5తో ఉంది. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డిలు పోటీలను పర్యవేక్షించారు.

వడ్డెర్లకు క్వారీల్లో రాయితీపై హర్షం

అనంతపురం క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వడ్డెర్లకు క్వారీల్లో రాయితీ ఇవ్వడం హర్షణీయమని వడ్డెర సంఘం రాష్ట్రఅధ్యక్షుడు, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి పేర్కొన్నారు. నగరంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొండ క్వారీ వర్కుల్లో వడ్డెర్లకు రాయితీ కల్పించడం ఆనందంగా ఉందన్నారు.

సూర్యఘర్‌పై అవగాహన

అనంతపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారిరోడ్డులో గల డి-సెక్షన్ ప్రాంగణంలో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సూర్యఘర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్ఈ శేషాద్రి హాజరై మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా పేద, మధ్య తరగతి ఇళ్లల్లో సౌరవెలుగులు నింపాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంకల్పిస్తున్నాయన్నారు. అందుకు అనుగుణంగా రాయితీలు ఇవ్వనున్నాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే తగ్గిన జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలపైవివరించారు. అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్ , డీఈఈలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రవిశంకర్, ఏఈఈలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టండి: ఎస్పీ

అనంతపురం క్రైం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో జనాలు, వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ట్రాఫిక్, ఇతర పోలీస్ అధికారులను ఎస్పీ జగదీష్ ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన నగరంలోని శ్రీనగర్ కాలనీ శివార్లలో సిద్ధం చేస్తున్న టపాసులు విక్రయ ప్రాంతాన్ని, ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. తర్వాత మాట్లాడుతూ... ప్రజల అవసరాల దృష్ట్యా వాహనాల రద్దీ పెరిగితే.. దానికి అనుగుణంగా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు.



కొలువు కలకళ..!

పేదింటి బిడ్డలకు ప్రభుత్వ ఉద్యోగాలు ..
కష్టేఫలికి నిదర్శనంగా నిలిచిన యువత

నల్లమాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం.. సామాన్య, పేద, మధ్య తరగతి వర్గాల కల. దాన్ని సాకారం చేసుకునేందుకు అనేక మంది యువత నిత్యం శ్రమిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే ఉద్యోగ భద్రతతో పాటు సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం దక్కుతాయి. ఇటీవల మండలంలోని పలువురు కానిస్టేబుల్, ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ప్రయత్నలోపం లేకుండా శ్రమిస్తే విజయం వరిస్తుందనేందుకు వీరు ఉదాహరణగా నిలిచారు. మండలంలో కుటాలపల్లి గ్రామానికి చెందిన చిన్న వెంకటేష్ నాయక్, చెన్నకేశవనాయక్, దొన్నికోట గ్రామానికి చెందిన రియాజ్‌ఖాన్, పులగంపల్లి గ్రామానికి చెందిన ఆసీఫ్‌బాషా, మనకవంకపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ, నేరాలవంకతండాకు చెందిన సంధ్య, బాసంవారిపల్లి గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. అలాగే ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన బసనగాని సుమంత్, కురుమాల గ్రామానికి చెందిన కొండె జ్యోత్స్న, పుల్లగూర్లపల్లికి చెందిన గంగప్ప ఉపాధ్యాయ కొలువులు సాధించారు. పేదరికానికి ఎదురొడ్డి నిలిచి, అచెంచల దీక్షతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విజయగాథ వారి మాటల్లోనే...

గొర్రెలు కాసి చదివించారు

మా నాన్న చంద్రానాయక్, అమ్మ లక్ష్మీదేవి. వీరు సేద్యపు పనులతో పాటు గొర్రెలు కాస్తూ నన్ను చదివించారు. మాకు రెండెకరాల పొలం ఉంది. ఆ పొలం పనులు అమ్మ చూసుకుంటుండగా నాన్న గొర్రెలు మేపేవాడు. వారి కష్టాన్ని చూసి బాగా చదివి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని చిన్నప్పుడే నిశ్చయించుకున్నా. 1 నుంచి ఏడో తరగతి వరకు మా ఊర్లోనే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. 8 నుంచి పదో తరగతి వరకు నల్లమాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివా. ఇంటర్ కూడా నల్లమాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే పూర్తి చేశా. అప్పట్లో క్రీడా పోటీల్లో బాగా ఆడేవాడిని. ఆ ఆటలు నేను పోలీస్ ఉద్యోగం సాధనలో ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఫిజికల్ ఫిట్నెస్ క్రీడల వల్లే సాధ్యమైంది. మంచిగా విధులు నిర్వహించి, నా తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తా.



- చిన్న వెంకటేష్‌నాయక్, కుటాలపల్లి తండా

వలస వెళ్లి సాకారు



మాది నిరుపేద కుటుంబం. నన్ను చదివించి ప్రయోజకులను చేయడానికి మా నాన్న కృష్ణమూర్తి, అమ్మ రామకృష్ణమ్మ అహోరాత్రులు శ్రమించారు. ఇందుకోసం వారు 13ఏళ్ల బెంగళూరుకు వలస వెళ్లి, అక్కడ గార్మెంట్స్ పని చేశారు. వచ్చిన సంపాదనతో నన్ను చదివించారు. పాఠశాల నుంచి ఇంటర్ వరకు నా విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ విద్యాలయాల్లోనే సాగింది. టీటీసీ రాయచోటి, బీఈడీ కర్నూలులో కన్వీనర్ కోటాలో పూర్తి చేశా. 2018లో డీఎస్సీ రాసినా రాలేదు. చాలా నిరుత్సాహం కలిగింది. అయితే అమ్మానాన్నల కష్టాన్ని తలచుకుని ఎంత కష్టమైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని ప్రయత్నించా. పగలు రాత్రి అదే ధ్యాసతో గడిపా. ఈక్రమంలోనే డీఎస్సీ-2025లో మెరుగైన ర్యాంకు రావడంతో సోషియల్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యా. నాకు ఉద్యోగం వచ్చిన విషయం తెలియగానే నా తల్లిదండ్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. ప్రస్తుతం పుట్టపర్తి మండలం పెడబల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా.

- బసనగాని సుమంత్, స్కూల్ అసిస్టెంట్, ఎర్రవంకపల్లి

అక్కా బావ ప్రోత్సాహంతో..



మా అక్క, బావ ప్రోత్సాహంతోనే నేను కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. నాన్న జయరాం నాయక్, అమ్మ శాంతమ్మ. మాకున్న రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని సాగు చేస్తూ మమ్మల్ని పెంచి, చదువు చెప్పించారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మా ఊర్లోనే ప్రభుత్వ బడిలో చదివా. 8 నుంచి పదో తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలో చదువుకున్నా. ఇంటర్, డిగ్రీ అనంతపురం ప్రభుత్వ కళాశాలలో చదివా. చదువు గురించి, ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే వచ్చే మర్యాద గురించి తరచూ మా అక్క, బావ చెప్పేవారు. వారి ప్రోత్సాహంతోనే కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నాలు ప్రారంభించా. ఈక్రమంలోనే కాకినాడ శ్యామ్ ఇన్స్టిట్యూట్‌లో ఆరు నెలలు పాటు కోచింగ్ తీసుకున్నా. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లోనే ఈవెంట్స్‌తో పాటు ప్రిలిమ్స్ పూర్తి చేశా. అయితే ఎంపికైన వారందరికి ఉద్యోగాలు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అప్పట్లో దరఖాస్తు చేసుకున్నవారందరికీ రెండుసార్లు పరీక్షలు నిర్వహించి మెరిట్ సాధించిన వారిని పోలీసు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈక్రమంలో నాకు కూడా ఉద్యోగం వచ్చింది.

- చెన్నకేశవనాయక్, కుటాలపల్లి తండా

నా భర్తే గురువు...



నా ఉద్యోగ సాధనలో నా భర్త కొండే భానుప్రకాష్‌రెడ్డి గురువుగా నిలిచాడు. నాకు వివాహం అయిన తర్వాత చదువు విలువ తెలియజెప్పి బాగా చదవాలని ప్రోత్సహించేవారు. ఆయన ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. నాకు తెలియని సబ్జెక్ట్ విషయాలు ఎన్నో వివరించేవారు. ఈక్రమంలో 2018లో డీఎస్సీ రాసినా ఫలితం లేకపోయింది. అయితే నేను కుంగిపోకుండా నా భర్త అండగా నిలిచాడు. దీంతో మరింత పట్టుదల చదివి 2025లో ఎస్జీటీగా ఉద్యోగం సాధించా. ప్రస్తుతం అమడగూరు మండలం చినగానిపల్లి పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నా. - కొండె జ్యోత్స్న, కురుమాల

పండుగకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంతకల్లు డివిజన్ మీదుగా సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి ప్రత్యేక రైలు (06303)ను ఈ నెల 18న, కలబురగి-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (06204)ను ఈ నెల 20న నడపనున్నట్లు తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి ప్రత్యేక రైలు (06307) ఈ నెల 20న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06208) ఈ నెల 21న నడుపుతామన్నారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి ప్రత్యేక రైలు (0630) ఈ నెల 21న, కలబురగి-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (06210) ఈ నెల 22న నడపనున్నట్లు వివరించారు. ఈ రైళ్లు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు. యశ్వంతపూర్-ముజఫర్ నగర్ ప్రత్యేక రైలు (06261) ఈ నెల 22న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06262)ను ఈ నెల 24న నడుస్తాయన్నారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, డోన్, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట, రామగుండం, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, సట్నా, ప్రయాగరాజ్ చౌకీ, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బక్సర్, ఔర, దానాపూర్, పాటలీపుత్ర, సోన్‌పూర్, హాజీపూర్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

సోలార్‌తో ఆదాయం : మంత్రి సవిత



ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌తో ఆదాయం వస్తుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. శనివారం సోలార్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డెమో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ బిగించుకోవాలని తెలిపారు. సోలార్ వినియోగంతో ఎలాంటి విద్యుత్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని, మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా వినియోగదారులకు ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ రామక్రిష్ణప్ప, నాయకులు శ్రీరాములు, గోపాల్, పోతిరెడ్డి, రామక్రిష్ణ, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, కృష్ణమూర్తి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది అధికారికంగా ధన్వంతరి జయంతి : మంత్రి

వచ్చే ఏడాది నుంచి ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం స్థానిక అన్నాక్యాంటిన్‌లో నాయిబ్రాహ్మణుల ఆరాధ్య దైవమైన ధన్వంతరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య



సుదర్శన్ (ఫైల్)

గార్లదిన్నె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. మండలంలోని ఇల్లూరు గ్రామానికి చెందిన కురువ సుదర్శన్ (28) అనే కౌలు రైతు శనివారం మృతి చెందాడు. ఇల్లూరు గ్రామానికి చెందిన కురువ సుదర్శన్, మమత దంపతులు ఉన్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. గత మూడేళ్ల నుంచి పంట దిగుబడి రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. పంట సాగుకోసం తెలిసిన వారివద్ద అప్పులు చేశాడు. దిగుబడి రాకపోవడంతో పాటు అంతోఇంతో పండిన పంటకు గిట్టుబాటు ధర రాలేదు. పంట సాగుకోసం చేసిన అప్పులు అధికమయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలని దంపతులిద్దరు తరుచు బాధపడుతుండేవారు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది సుదర్శన్ శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చదువుపట్ల ఆసక్తిలేక విద్యార్థి..



మనోజ్‌కుమార్ (ఫైల్)

మడకశిర రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చదువుకోవడం ఇష్టం లేక ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని దిగువ ఈచలేడి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి మనోజ్‌కుమార్ (15) శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ ముత్యాలప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. మనోజ్‌కుమార్ బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదిస్తున్నారు. మనోజ్‌కుమార్‌కు చదువు పట్ల ఆసక్తి లేదని తెలిపారు. పాఠశాలకు వెళ్లలేక మనస్థాపం చెంది ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. విద్యార్థి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

కనగానపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని యలక్కుంట్ల పెద్దమ్మస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద పెద్దమ్మస్వామి ఆలయం ఉంది. అర్ధరాత్రి వేళ ఆలయంలో చొరబడిన దొంగలు అమ్మవారి వెండి ఆభరణాలతో పాటు హుండీని ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయానికి వెళ్లిన పూజారులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. అనంతరం గ్రామస్థులు గ్రామ శివారులో దుండగులు ధ్వంసం చేసిన హుండీని పరిశీలించారు. వెండి ఆభరణాలు, నగదు మొత్తం కలిపి రూ.2 లక్షలు విలువ ఉంటుందని గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'ట్రంప్ సుంకాల యుద్ధం' ఆవిష్కరణ



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత దేశంపై ట్రంప్ సుంకాల యుద్ధం బుక్‌లెట్‌ను సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ ట్రంప్ టారిఫ్ టెర్రరిజం, మోదీ లొంగుబాటుకు వ్యతిరేకంగా సీపీఎం దేశవ్యాప్త నిరసనలకు పిలుపు ఇచ్చిందన్నారు. అందులో భాగంగానే జిల్లా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పార్టీ కేంద్ర కమిటీ ముద్రించిన బుక్‌లెట్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలు, వజ్రాలు, మందులు, వస్త్రాలు, ఫార్మా ఉత్పత్తులు, ఆఖరుకు సినిమాలపైనా పన్నులు వేస్తున్నారన్నారు. దీంతో ఆయా పరిశ్రమలపై ఆధార పడిన అనేక మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. కాగా అమెరికా నుంచి భారత దేశానికి పన్నులు లేకుండా డైరీ, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేస్తోందన్నారు. అదే జరిగితే మన వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వీసాల ఆంక్షలతో ఎన్ఆర్ఐ ఉద్యోగులు, విద్యార్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. ఈ స్థితిలో భారత దేశ యువత భవిష్యత్తును కాపాడాల్సిన మోదీ ప్రభుత్వం చేష్టలుడికి వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఈ అంశంపై తమ అభిప్రాయం వ్యక్తపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై ఉక్కుపాదం: ఎస్పీ

వేర్వేరుచోట్ల రూ. 19.39 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లోని ఇళ్లు, ఆలయాలు, రైతుల పొలాల్లో చోరీలకు పాల్పడిన దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో పుట్టపర్తి, కదిరి డీఎస్పీలు విజయ్‌కుమార్, శివన్నారాయణస్వామితో కలసి ఎస్పీ కేసుల వివరాలు వెల్లడించారు. పుట్టపర్తి, బ్రాహ్మణపల్లి, గోరంట్ల, సోమందేపల్లి, కియా, రొద్దం ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న నరసింహమూర్తిని అరెస్ట్ చేసి.. రూ. 12లక్షల విలువచేసే 100 గ్రాముల బంగారం, సెల్‌ఫోన్, మారుతి కారును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నల్లమాడ, ఓడీసీ, అమడగూరు, బుక్కపట్నం, పుట్టపర్తి, తలుపుల, గాండ్లపెంట, కదిరి, రామగిరి మండలాల పరిధిలో పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి అల్యూమినియం, వైర్లు దొంగలించిన.. నల్లమాడకు చెందిన మునిమడుగు రంగనాథ్, వెంకటేష్, బుక్కపట్నంకు చెందిన కుంచెపు గణేష్, ఎన్పీకుంటకు చెందిన వెంకటరమణప్ప, మహమ్మద్‌రఫీ, సోమందేపల్లికి చెందిన సాదిక్‌ఖాన్‌ను అరెస్టు చేసి 657 కిలోల అల్యూమినియం వైరు, రూ. 5.07 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆలయాల్లో చోరీలకు పాల్పడిన కోలార్ జిల్లాకు చెందిన కావడి శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లాకు చెందిన బండి సోమశేఖర్, మెనపడి రమేష్, కర్ణాటకకు చెందిన కొండాచారిని అరెస్టు చేసి రూ. 2.16 లక్షల నగదు, వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నల్లమాడ మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ఆచూకీ తెలిపిన దంపతులను ఎస్పీ సన్మానించారు. దొంగల ముఠాలను అరెస్టు చేయడంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, కదిరి డీఎస్పీ శివన్నారాయణ ఆధ్వర్యంలో చొరవ చూపిన పుట్టపర్తి సీఐ శివాంజనేయులు, నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఓడీసీ ఎస్ఐ మల్లికార్జున, గాండ్లపెంట ఎస్ఐ రవికుమార్, అమడగూరు ఎస్ఐ ప్రదీప్ ఎరాజు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సతీష్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

జర్నలిజంలో విశ్వసనీయత ముఖ్యం

ప్రభుత్వ విప్ కాలవ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు వృత్తిలో విశ్వసనీయత ముఖ్యమని, నిరంతరం శ్రమించడం వల్లనే అది సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన గ్రామీణ విలేకరుల పునశ్చరణ తరగతులు శనివారం ముగిశాయి. ఏపీయూడబ్ల్యూజే నిర్వహించిన తరగతుల్లో శిక్షణ పొందిన జర్నలిస్టులకు అకాడమీ నుంచి పత్రాలను అందించారు. క్రైమ్ రిపోర్టింగ్‌పై ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ రిపోర్టర్ శ్రీశైలం రమేష్, పత్రికా భాషపై సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, కృత్రిమ మేధపై సీనియర్ జర్నలిస్టు కుర్రా విజయకుమార్ శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో కాలవ మాట్లాడుతూ.. నిబద్ధత, చిత్తశుద్ధితో జర్నలిస్టులు వృత్తికి వన్నె తేవాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు పాత్రికేయుడు అవుతున్న నేటి ఆధునిక యుగంలో సామాజిక అంశాలను కొత్తగా రాయాలని సూచించారు. సీఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ మాట్లాడుతూ.. రెండురోజుల పాటు జరిగిన పునశ్చరణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను విలేకరులు ఆచరణలో పెట్టాలని సూచించారు. ప్రతి విలేకరి నైతిక విలువలు పాటించాలని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో కోత పెట్టిందని, ఈ ప్రభుత్వంలో అర్హులకు న్యాయం చేయాలని కోరారు. హెల్త్‌స్కీం, ఇంటి స్థలాలు వంటి సంక్షేమ కార్యక్రమాలకు అక్రిడిటేషన్ల అవసరం ఉందని తెలిపారు. విశ్రాంత జర్నలిస్టులకు పెన్షన్ స్కీం విషయంలో అండగా ఉండాలని విప్‌ను కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండప్ప, జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ అయూఫ్ పాల్గొన్నారు.

హాకీ, బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన ఎస్‌జీఎఫ్ హాకీ బాలికల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్-14, 17 హాకీ, బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బాస్కెట్‌బాల్, ఆర్డీటీ స్టేడియంలో హాకీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు.

హాకీ అండర్-17 బాలుర జట్టుకు సంతోష్, సాదిక్, కుమార్, బాలరాజు, వెంకటేష్, నవదీప్, విక్రాంత్, ఉదయ్‌కుమార్, మనోజ్, మేఘనాథ్, పోతులయ్య, భీమా, సాత్విక్, గోవర్ధన్, అశోక్, బాలాజీ, జగదీష్, షాదిక్‌వలీ, రిహాన్ ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు మిరాంబీ, జ్యోతి, దివ్య, నవ్యశ్రీ, శ్రీవల్లి, లాస్యరెడ్డి, ప్రేమలత, మోక్షిత, నందిని, కీర్తన, యశస్విని, ఉషశ్రీ, అనురాధా, దీపిక, స్వాతి, జగదీశ్వరి, సమీరా, మల్లికలు ఎంపికయ్యారు.

హాకీ అండర్-14 బాలుర జట్టుకు వరుణ్, లక్ష్మీనారాయణ, శివశంకర్, సునీల్, ఉదయ్‌కుమార్, బాబాఫరీద్, అభినాష్, మణికుమార్, రాజు, మనోజ్, సాదిక్, జయంత్, పవన్, విక్కీ, అజయ్, నవీన్, రవితేజ, మురళీ, భార్గవ్ ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు సనా, గుణశ్రీ, శ్రీరానికా, శ్రీలేఖ, ఇందు, అర్చన, మాన్య, ప్రియాంక, నాగమణి, మానస, హేమ, హిమబిందు, కావ్యశ్రీ, వర్షిణి, మోక్షిత, భానుశ్రీ, స్వాతి, నందలక్ష్మి ఎంపికయ్యారు.

బాస్కెట్‌బాల్ అండర్-17 బాలుర జట్టుకు సాయిసాత్విక్ వర్ధన్, కౌశిక్, లచ్చి, యశ్వంత్, కార్తీక్ నాయక్, సంతోష్, మనీష్, ఉజ్వనేశ్వర్, యేసుర్, భరత్‌సింహా రెడ్డి, హేమంత్, నవీన్‌కుమార్ రెడ్డి ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు ధన్వి, శ్రావ్య, వాణిశ్రీ, మన్విత, శరణ్య, శ్రావణి, వర్షిణి, సంధ్యా, మహిత, రచన, జయలక్ష్మి, ఓంశ్రీజోష్ణ ఎంపికయ్యారు.

అండర్-14 బాలుర జట్టుకు యోగేశ్వర్, మిథిల్‌సత్య, షణ్ముఖ, గౌతమ్, అభిజ్ఞారామ్, రాఘవ్, వరుణ్యకుమార్ రెడ్డి , ప్రశాంత్, భావిష్‌రెడ్డి , తరుణ్, రాజు, హితేష్‌చౌదరి ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు హర్షిత, సిద్రహా, పూజిత, అమృత, ప్రియదీప్తి, కారుణ్య, అరీనా, భావన, పల్లవి, అఫ్రీనా, ప్రజ్వల, సోనాక్షి ఎంపికయ్యారు. వీరంతా ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సభ్యులు తెలిపారు.

విశాఖకు గూగుల్.. హర్షణీయం

మంత్రి లోకేశ్ చొరవకు అభినందనలు
సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్



మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయిలో అత్యంత గుర్తింపు పొందిన గూగుల్ సంస్థ విశాఖపట్నంకు రావడం హర్షణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేవరగుడి జగదీష్ పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గూగుల్ సంస్థను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడాన్ని సీపీఐ స్వాగతిస్తోందని అన్నారు. గూగుల్‌ను విశాఖకు తీసుకురావడానికి చొరవచూపిన మంత్రి నారా లోకేశ్‌ను అభినందిస్తున్నామని తెలిపారు. తమ పార్టీ ప్రతిపక్షంలో ఉంటూ పోరాటాలు చేస్తున్నా.. రాష్ట్ర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మంచి పనులను ఎపుడూ స్వాగతిస్తుందని అన్నారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయడం వల్ల ఇతర ప్రముఖ సంస్థలు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతాయని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కర్నూలులో హైకోర్టు బెంచ్, అనంతలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జీఎస్టీపై ప్రధాని నరేంద్రమోదీ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి, ప్రజల్లో వ్యతిరేకత రావడంతో కొంత తగ్గించి గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మరో రాష్ట్రనేత జాఫర్ మాట్లాడుతూ.. జీఎస్టీ ప్రచారానికి కోట్లు ప్రజాధనం ఖర్చుపెడుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రచారం చేసేటపుడు పెట్రోల్, డీజిల్ ధరలకు జీఎస్టీ ఎందుకు వర్తింపచేయలేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, శ్రీరాములు, రమణయ్య, రామక్రిష్ణ పద్మావతి, అల్లీపీరా తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరిగా రూ.10 వేలు పలికాయన్నారు.

టమోటా కిలో రూ. 21

అనంతపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.21తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.12, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1875 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

బైకును ఢీకొన్న లారీ


లారీ కింద ఇరుక్కున్న ద్విచక్రవాహనం

బొమ్మనహాళ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో లారీ కింద ద్విచక్రవాహనం పడి స్వల్ప గాయాలతో ముగ్గురు యువకులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు బళ్లారి వైపు నుంచి కణేకల్లుకు ద్విచక్రవాహనంలో షాకీర్, ఆయాన్, అస్లాంలు వస్తున్నారు. వెనక వైపు నుంచి లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. యువకులు కిందపడి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

గుత్తిరూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు విద్యార్థులు, ఆటో డ్రైవర్ గాయపడ్డారు. వివరాలా ఉన్నాయి.. మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామ సమీపంలో శనివారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ఇసురాళ్లపల్లికి గ్రామానికి చెందిన మారుతీ, శివగంగయ్య బైకుపై గుత్తిలో కళాశాలకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన విద్యార్థి తిరుమలేష్ బైకు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో ముగ్గూరు గాయపడ్డారు. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆటో, కారు ఢీ..

తాడిపత్రి(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగనూరు సమీపంలో శనివారం ఆటోను కారు వెనుకవైపు నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ హరేంద్ర గాయపడినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. బొందలదిన్నె గ్రామం నుంచి విద్యార్థులను ఆటోలో తీసుకువస్తుండగా వంగనూరు సమీపంలోకి రాగానే వెనుకవైపు నుంచి కారు ఢీకొనడంతో డ్రైవర్ గాయపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పాఠశాలలో ఊడిపడిన పైకప్పు పెచ్చులు

విడపనకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9వ తరగతి గదిలో పైకప్పు శనివారం ఊడి పడింది. తరగతి గదిలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు లేని చోట పెచ్చులూడి పడటంతో ప్రమాదం తప్పింది. గతంలో ఇదే పాఠశాలలో పైకప్పు ఊడి పడి మాజీ ఎంపీటీసీ మనవడు గాయపడిన విషయం తెలిసిందే. ఎప్పుడు ఏ గదిలోని పైకప్పు ఊడి పడి విద్యార్థులకు ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు దృష్టి సారించి కొత్తగదులను నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతు

పుట్లూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతు శివశంకర్‌రెడ్డి నకిలీ మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయాడు. ఈ మేరకు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయగా శనివారం వ్యవసాయాధికారి కాత్యాయిని, ఏఈఓ నాగిరెడ్డి పంటను పరిశీలించారు. రైతు తెలిపిన మేరకు తాడిపత్రి పట్టణంలోని ఓ ఫర్టిలైజర్స్‌షాపులో రూ.21వేలు వెచ్చించి ఐదెకరాలకు 12ప్యాకెట్ల మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేశాడు. మూడునెలల కిందట విత్తనం వేశాడు. పంట ఏపుగా పెరిగిన కంకులు రాకపోవడంతో విత్తనాలు కొనుగోలు చేసిన యజమానిని అడగ్గా మా వద్ద అన్ని నాణ్యతగా ఉంటాయని ఎలాంటి సమస్య లేదని జవాబుఇచ్చాడు. దీంతో వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశాడు.

సూర్యఘర్‌ను ప్రజల్లోకి తీసుకెళ్దాం: విప్ కాలవ

రాయదుర్గం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సూర్యశక్తిని ఉపయోగించుకొని విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశాన్ని సూర్యఘర్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిర్వహించిన సూర్యఘర్ అవగాహన కార్యక్రమంలో విప్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి తగిన ప్రోత్సాహాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూ ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ పథకాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమ భాగస్వాములు ప్రధాన భూమిక పోషించాల్సి ఉందన్నారు. తాను కూడా ఈ అంశాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తానన్నారు. ఒక కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సోలార్ పరికరాల ఏర్పాటుపై ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తోందన్నారు. రెండుకిలోవాట్స్‌పై రూ.60 వేలు, మూడు కిలోవాట్స్‌పై రూ.78 వేలు చొప్పున సబ్సిడీ అందిస్తుందన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

రైల్వే ఇన్‌స్టిట్యూట్ తనిఖీ

గుత్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ను శనివారం గుంతకల్లు డివిజన్ ఏడీఆర్ఎం సుధాకర్ తనిఖీ చేశారు. రైల్వే కార్మికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన జిమ్, టెన్నిస్ కోర్టు పరిశీలించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయం చేసుకుని ఆయన క్రీడల్లో పాల్గొన్నారు. డీఓఎం పూర్ణచంద్ర, డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ రమేష్, ఏడీఎంఈ అశోక్‌గౌడ్, రైల్వే మజ్దూరు యూనియన్ ఏడీఎస్ నారాయణ, ఇనిస్టిట్యూట్ సెక్రెటరీ నాయబ్ రసూల్, తదితరులుపాల్గొన్నారు.

రైల్వే డీజిల్ ఎలక్ట్రికల్ షెడ్ తనిఖీ: గుత్తి డీజిల్ ఎలక్ట్రికల్ లోకో షెడ్‌ను శనివారం పీసీఈఈ ఎస్ఈ బ్రిడ్జ్ మోహన్ మీనా తనిఖీ చేశారు. వ్యాప్ టెక్ ఇంజన్ల పనితీరును, జీ9 ఎలక్ట్రికల్ ఇంజన్లు, పీ4, జీ4 ఇంజన్ల పనితీరును ఆయన పరిశీలించారు. స్థానిక అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. షెడ్ అభివృద్ధి గురించి అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. సీనియర్ డీఎంఈ రమేష్, డీఈఈ నాగేశ్వరరావు, ఏడీఎంఈలు అశోక్‌గౌడ్, సుంకన్న, ఎస్ఎస్‌సీ జనరల్ గోవిందరాజులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్ ఎన్నికలకు నోటిఫికేషన్

తాడిపత్రి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాడిపత్రి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి వైఎండీ ఇస్మాయిల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. నామినేషన్ 23న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టౌన్ బ్యాంక్‌లోనే అందజేయాలన్నారు. దాఖలైన నామినేషన్లు మధ్యాహ్నం 2గంటల తర్వాత విడుదల చేస్తామన్నారు. నామినేషన్ల పరిశీలన 24న, ఉపసంహరణ 25న సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. 25వతేదీ సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాతోపాటు వారి గుర్తులను కేటాయిస్తామన్నారు. 29న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరస్వతి విద్యామందిరంలో పోలింగ్ ఉంటన్నారు. ఫలితాలు అదేరోజు ప్రకటిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌కు విద్యార్థి ఎంపిక

తాడిపత్రి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న హాజియా తబసుం రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. 17న జిల్లా కేంద్రంలో జరిగిన సైన్స్ సెమినార్ పోటీల్లో ప్రతిభ కనబరిచి తబసుం రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

డీ.హీరేహాళ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ సచివాలయంలో వైసీపీ నాయకుడి జన్మదిన వేడుకలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి శుక్రవారం గ్రామ సచివాలయంలో వైసీపీ నాయకుడి బర్త్‌డే అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైనది. జిల్లాస్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఎంపీడీఓ దాసనాయక్ శనివారం గ్రామ సచివాలయానికి వెళ్లి అక్కడ నిర్వహించిన జన్మదిన వేడుకలకు సంబంధించి విచారణ చేపట్టారు. విచారణ అనంతరం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి రమణతో పాటు మరో ఇద్దరు సిబ్బందికి నోటీసులు ఇచ్చారు.

సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోండి: డీఈ


మాట్లాడుతున్న ట్రాన్స్‌కో డీఈ రాజశేఖర్

కళ్యాణదుర్గం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సబ్సిడీతో ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ రాజశేఖర్ తెలిపారు. శనివారం పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో సూపర్ గిఫ్ట్ జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సును నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ-2.0ను సూపర్ గిఫ్ట్‌గా ఇచ్చారన్నారు. దీనిద్వారా సోలార్ ఏర్పాటుకు కూడా ప్రభుత్వం సబ్సిడీలను మంజూరు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ ఏర్పాటులో ఉపయోగాలపై అవగాహన పెంచుకోఆలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, ట్రాన్స్‌కో సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్ సుబహానీ ఉరుసు

గుత్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని నాలగడ్డ వీధిలో వెలసిన హజరత్ మహబూబ్ సబహానీ ఉరుసు ఉత్సవాలను శనివారం దర్గా కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. వేకువజామున గుర్రంమీద షంషీర్‌ను పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి బెంగళూరు, ఢిల్లీ వారిచే ఖవాలీ నిర్వహించారు. ఆదివారం జియారత్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు అందజేశారు. కౌకుంట్లలోని మంత్రి స్వగృహంలో శనివారం చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 63 మందికి రూ.37.37లక్షల చెక్కులను అందజేశారు. ప్రభుత్వం అందజేసే సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య అవసరాలకు వినియోగించుకోవాలన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

బెళుగుప్ప, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు చొరవచూపాలని, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, గోడౌన్‌కు వెళ్లడానికి దారి లేదని, సమస్యలు పరిష్కరించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ పుష్పావతి, ఎంపీడీవో ఆదినారాయణ, ఏపీఎం సురేఖ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఏవో పృథ్వీసాగర్, టీడీపీ నాయకులు పెద్దతిప్పయ్య, తగ్గుపర్తి రాధాకృష్ణ ప్రసాద్, విరుపాపల్లి రాధాకృష్ణ, ఆవులెన్న సర్పంచ్ రాము, సునిల్ పాల్గొన్నారు.

ఉరవకొండ(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ భవనంలో మండల సర్వసభ్యసమావేశాన్ని ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. శుక్రవారం కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసి శనివారం నిర్వహించినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు నామమాత్రంగా హాజరయ్యారు. సమావేశంలో సర్పంచ్ యోగేంద్రరెడ్డి అదును దాటుతున్నప్పటికీ పప్పుశనగ పంపిణీ చేయకపోవడంపై అధికారులను నిలదీశారు. ఎంపీడీవో రవిప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.